క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో సోమవారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉప ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శనగలు ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లికి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

లొల్ల కుటుంబానికి గీత పరామర్శ


వాకతిప్పలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన వెంకరామలక్ష్మీ ఫ్యాబ్రిక్స్ అధినేత కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పరామర్శించారు. లొల్ల సుబ్రహ్మణ్యం భార్య వెంకటేశ్వరి అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, గింజాల శ్రీనివాస్, గోపి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ



సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఢీకొన్న లారీలు

సామర్లకోట: పెద్దాపురం ఏడీబీ రోడ్డులో పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని పెట్రోలు బంకు వద్ద రెండు లారీలు ఆగి ఉన్నాయి. సోమవారం రాత్రి ముందు ఉన్న లారీని స్టార్ట్ చేయగా.. అది వెనక్కు రావడంతో, అక్కడున్న మరో లారీని ఢీకొంది. లారీ నెమ్మదిగా రావడంతో భారీ నష్టం తప్పింది. ఈ క్రమంలో ఏడీబీ రోడ్డులో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు


పులిమేరులో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కౌడా చైర్మన్

పెద్దాపురం: నియోజకవర్గంలో ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. పులిమేరు గ్రామంలో జల్‌జీవన్ మిషన్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకులను సోమవారం వారు ప్రారంభించాచు. సర్పంచ్ తుమ్మల సురేఖ అధ్యక్షత వహించారు. వేసవిలో నీటి కొరత ఉండరాదనే ఉద్దేశంతో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు.

కుప్పకూలిన పార్కింగ్ షెడ్డు


జీజీహెచ్‌లో కూలిన పార్కింగ్ షెడ్డు

కాకినాడ క్రైం: నగరంలో ఆదివారం రాత్రి వీచిన పెనుగాలుల ధాటికి జీజీహెచ్‌లో ఓ షెడ్డు కుప్పకూలింది. క్యాన్సర్ వార్డు ఎదురుగా, డంప్ యార్డ్ పక్కన ఉన్న ఈ షెడ్డును పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. గాలుల బీభత్సానికి భూమిలో ఉన్న షెడ్డు స్తంభాలు వంగిపోయాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఈ షెడ్డును పరిశీలించారు. ఆదివారం, రాత్రివేళ కావడంతో వాహనాలు తక్కువగా ఉండడం వల్ల పెద్దగా నష్టం వాటిల్లలేదు.


సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు


సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్


సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో నివాళులు అర్పిస్తున్న స్టేషన్ మేనేజర్, ఇతర ఉద్యోగులు


ఆర్డీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి, సిబ్బంది


పెద్దాపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

- డాక్టర్ అంబేడ్కర్‌కు వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దొరబాబు నివాళి
- పేదలకు చీరలు, పాదరక్షల పంపిణీ
- వాడవాడలా రాజ్యాంగ నిర్మాతకు నివాళులు

సామర్లకోట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక బ్రౌన్‌పేట అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, అణగారిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ యువజన సంఘం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని దొరబాబు ప్రారంభించారు. బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి దొరబాబు నివాళులర్పించారు. పేదలకు చీరలు, పాదరక్షలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక సీతారామ కాలనీ, కోట్లమ్మ చెరువు, బలుసులపేటలోని అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, వైఎస్సార్ సీపీ అయ్యారక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నూతలపాటి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, కౌన్సిలర్లు పాలిక కుసుమచంటి, రెడ్నం సునీత, పెండ్యాల వెంకటలక్ష్మి, పిట్టా సత్యనారాయణ, మర్రి శేషారావు, మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, సీఐ ఎ.కృష్ణభగవాన్, దళిత సంఘ నాయకులు అందుగుల జార్జిచక్రవర్తి, లింగం శివప్రసాద్, సలాది భీమేశ్వరరావు, జుత్తుక అప్పారావు, జీవీ రాఘవ, జుత్తుక సుబ్బలక్ష్మి, బి.అన్నపూర్ణ, డాక్టర్ వైఎస్సార్ యువసేన జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసు, పార్టీ నాయకులు రెడ్నం దొరబాబు, తర్లంపూడి కమల్‌రాజు, చిట్టుమాని శ్రీనివాసరావు, కానేటి బుల్లిఅప్పారావు, బీసీ సంఘ అధ్యక్షుడు వేగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని బలుసులపేట, బ్రౌన్‌పేట, భీమవరంపుపేటలోని అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శ్రీవిద్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ నివాళులర్పించారు. సామర్లకోట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు నివాళులు అర్పించారు. ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, ఏఓ ప్రసాద్, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, రైల్వే స్టేషన్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



సామర్లకోట బ్రౌన్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దొరబాబు తదితరులు

అందరికీ ఆదర్శప్రాయుడు

పెద్దాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు, ఆర్డీఓ కె.శ్రీరమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. కొండయ్యపేటలో అన్నదానం నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కె.శ్రీరమణి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీటీ భానుకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీఓ శ్రీలలిత ఘనంగా నివాళులర్పించారు.

మతోన్మాద బీజేపీని ఎదుర్కొందాం

అంబేడ్కర్ ఇచ్చిన స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మతోన్మాద బీజేపీని ప్రతిఘటించాలని సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనం నుంచి మున్సిపల్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఎం మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, సీఐటీయూ నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, దాడి బేబీ, కె.అప్పన్న, డి.సత్యనారాయణ, ఎం.రాంబాబు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముస్లింల నిరసన

డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను బీజేపీ తుంగలోకి తొక్కిందని విమర్శిస్తూ పెద్దాపురానికి చెందిన ముస్లిం నాయకుడు మహ్మద్ ముక్తార్‌ఆలీ అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహానికి ముస్లింలు నివాళులర్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మైనార్టీ ముస్లింలకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలులోకి తీసుకురావడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసిఫ్ ఆలీ, షేక్ గౌస్, ఎంఎల్ ఆలీ, విలాయత్ ఆలీ, నబీ, రిజ్వాన్, షబ్బీర్ ఆలీ, వివిధ మసీదుల ఇమామ్‌లు పాల్గొన్నారు.


పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


పిఠాపురం రైల్వే స్టేషన్‌లో..

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మాజీ ఎంపీ వంగా గీత

పిఠాపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఘనంగా అంబేడ్కర్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె.. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నేత గండేపల్లి బాబీ, ఉలవల భూషణం, పలువురు కౌన్సిలర్లు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రైల్వే స్టేషన్‌లో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు, రైల్వే స్టేషన్ మాస్టర్ పొన్నాడ నాగేశ్వరరావు తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కూటమి నేతలు పలుచోట్ల అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలో చేబ్రోలులో జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు తదితరులు అంబేడ్కర్ విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు.


పిఠాపురంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వంగా గీత తదితరులు

ఘనంగా అంబేడ్కర్ జయంతి

కొత్తపల్లి: మండలంలో డాక్టర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వాకతిప్ప, కొత్తపల్లి, పొన్నాడ, కొమరగిరి గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, గింజల శ్రీనివాస్, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు మాధవరావు, నాయకులు పాల్గొన్నారు. వాకతిప్పలోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వర్మ నివాళులర్పించారు.


గొల్లప్రోలు మండలం చేబ్రోలులో..


పెద్దాపురం మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

బాలుర హాస్టల్ పరిశీలన


బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: నగరంలోని బాలాజీ చెరువు సెంటర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్, సాంఘిక సంక్షేమ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆవరణలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వసతి గృహంలో రూ.29.75 లక్షలతో చేపట్టిన ఆధునీకరణ పనులను, రూ.95 లక్షలతో నిర్మించిన కిచెన్, డైనింగ్ హాలు నిర్మాణ పనులను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అధికారులు మరింత దృష్టి పెట్టి, చివరి దశ పనులను సకాలంలో పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అవసరమైన వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జేడీ జి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ ఆర్ జయరావు, డీఈ కె.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రూ.4 లక్షల ఆస్తి నష్టం

పెద్దాపురం: పట్టణంలోని రామారావుపేటలో సోమవారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రామారావుపేటకు చెందిన కాకర్ల జేమ్స్‌బాబుకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతి అయింది. విషయం తెలుసుకున్న ఆర్డీఓ కె.శ్రీరమణి సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితులను పరామర్శించి, ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. దాత, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పాణింగపల్లి చలపతి సహకారంతో బాధితులకు నిత్యావసర సరకులు అందజేశారు. సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

పంటలకు అపార నష్టం


కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో కూలిన ప్రహరీ

కొత్తపల్లి: మండలంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులు, వర్షానికి పంటలకు అపార నష్టం వాటిల్లింది. సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చెట్లు నేలకొరిగి, ట్రాఫిక్ స్తంభించింది. గాలుల కారణంగా వరి పొలాలు నేలనంటాయి. విద్యుత్ స్తంభాలు, తీగలపై చెట్లు కూలడంతో రాత్రంతా విద్యుత్ సరఫరాకు విఘాతం కలిగింది. ముఖ్యంగా మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. అరటి తోటలు వాలిపోయాయి. దీంతో మామిడి, అరటి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.


ఈదురు గాలుల కారణంగా తోటలో రాలిపోయిన మామిడి కాయలు


కూలిన విద్యుత్ స్తంభం


కొత్తపల్లిలో కూలిన చెట్టు

అంబేడ్కర్ చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా జడ్జి హరినారాయణ

కాకినాడ లీగల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ అన్నారు. స్థానిక కాకినాడ బార్ అసోసియేషన్ హాలులో డాక్టర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి హరినారాయణ మాట్లాడుతూ, వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించిన అంబేడ్కర్.. మన దేశంలో బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో బలమైన రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. మహనీయులు చేసిన త్యాగాలు వృథా కాకుండా దేశాభివృద్ధి కోసం పనిచేయాలని న్యాయవాదులకు సూచించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి ఆయనతో పాటు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా శ్రీనివాస్, న్యాయమూర్తులు, న్యాయవాదులు నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యురాలు ఎ.శ్రీదివ్య కుమార్తె మహన్విత కాకినాడ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో 2024లో టెన్త్ పరీక్షల్లో 561 మార్కులు సాధించింది. ఆమెకు బార్ అసోసియేషన్ తరఫున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెరిట్ స్కాలర్‌షిప్ రూపేణా రూ.5,046 నగదు, సర్టిఫికెట్‌ను జిల్లా జడ్జి హరినారాయణ, సంఘ ప్రతినిధులు అందజేశారు.


మహన్వితకు నగదు, సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా జడ్జి హరినారాయణ తదితరులు